

# రేవంత్ తీరు దారుణం

- బయటివ్యక్తుల చేతుల్లోకి కాంగ్రెస్
- హాఫ్ టికెట్ గాళ్లకు టికెట్లా?
- జూబ్లీహిల్స్‌లో పీ విష్ణువర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్.అక్టోబర్ 28: కాంగ్రెస్.. పార్టీకి విశ్వాసంగా ఉండేవారి చేతిలోనుంచి వేరేవాళ్ల చేతిలోకి వెళ్లిపోయిందని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పీ విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి దివంగత పీజేఆర్ వారసత్వాన్ని దెబ్బతీస్తూ తనకు టికెట్‌ను నిరాకరించడం షాక్‌కు గురిచేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ పనితీరు సరిగా లేదని, పార్టీని నాశనం చేస్తున్నారని ఆగ్రహించారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయిన తనకు టికెట్ ఇస్తామని పార్టీ సీనియర్ నేతలు మాణిక్‌రావు ఠాక్రే, రోహిత్ చౌదరి లాంటి వాళ్లంతా చెప్పడంతో చాలారోజులుగా ఇంటింటి ప్రచారం కూడా చేస్తున్నానని పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారాల్లో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కోవడంతోపాటు కేసుల్లో ఉన్న అజారుద్దీన్‌కు టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఒక కుటుంబానికి ఒకే టికెట్ అంటున్న కాంగ్రెస్ నాయకత్వం.. చాలా కుటుంబాలకు రెండు టికెట్లు ఎందుకు ఇచ్చిందని నిలదీశారు. కొంతమంది హాఫ్ టికెట్ గాళ్లకు కూడా టికెట్లు ఇచ్చుకున్నారని, తన సోదరికి ఖైరతాబాద్ టికెట్ ఇచ్చినందుకు తనకు ఇవ్వలేదనడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ టికెట్ రాకున్నా తాను జూబ్లీహిల్స్ బరిలో ఉంటానని, కార్యకర్తలు, నాయకులతో ఆదివారం చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. పీజేఆర్‌ను నమ్ముకున్న అనేకమందికి కాంగ్రెస్ ద్రోహం చేసిందని మండిపడ్డారు. తాజాగా ప్రకటించిన జాబితాలో 12 చోట్ల గెలిచే అభ్యర్థులకు కాకుండా ఇతరులకు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. సెక్యులర్ పార్టీగా ఉన్న కాంగ్రెస్ తరఫున కేవలం మతం ఆధారంగా టికెట్ ఇవ్వడం సరికాదని హితవుపలికారు. అజారుద్దీన్‌కు టికెట్ ఇవ్వాలనుకుంటే రాజేంద్రనగర్ వంటి నియోజకవర్గాలు ఉన్నాయని, అసదుద్దీన్ ఒవైసీ కూడా చాలెంజ్ చేసిన సంగతి గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇతర పార్టీలోకి వెళ్లాలని ఇప్పటిదాకా నిర్ణయించుకోలేదని, కార్యకర్తలతో చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## స్థానికేతరుడికి కోట్లకు టికెట్

**కష్టపడ్డవారికి కాకుండా ఇతరులకు టికెట్లా? • పీసీసీ సభ్యుడు వెంగళ రావు**



కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 28: కాంగ్రెస్ అధిష్ఠాన నేతలు కోట్ల రూపాయలు చేతులు మార్చుకుని పరాయి వ్యక్తికి టికెట్ కేటాయించారని కూకట్‌పల్లి సీనియర్ నేత గొట్టిముక్కల వెంగళరావు ఆరోపించారు. నియోజకవర్గంలో ఏండ్ల తరబడి పార్టీ జెండా మోస్తున్నవారికి కాకుండా స్థానికేతరులకు టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రేవంత్ మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసినప్పుడు కష్టపడి పనిచేసి గెలిపించామని చెప్పారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు తిలోకాలిచ్చారని, కోట్లాది రూపాయలు చేతులు మార్చుకుని పరాయి పార్టీనుంచి వచ్చిన స్థానికేతరుడికి టికెట్ కేటాయించారని ఆరోపించారు. నమ్ముకున్న పార్టీలో గుర్తింపు లేదని మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

# రేవంత్ చేరికతో కాంగ్రెస్ ఖతం

- పార్టీని భ్రష్టు పట్టించేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చాడు
- మలక్‌పేట టికెట్‌ను వేలం వేసి 10 కోట్లకు అమ్మాడు
- పీసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్




సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న షేక్ అబ్దుల్లా సోహైల్

ఖైరతాబాద్, అక్టోబర్ 28: 'నేను చూసిన కాంగ్రెస్ వేరు.. నేటి రేవంత్ చేతిలో ఉన్న పార్టీ వేరు.. టికెట్లను వేలంలో సరుకు చేశాడు.. 34 ఏండ్లు సేవలందించా.. రేవంత్ చేష్టల వల్లే రాజీనామా చేస్తున్నా' అని పీసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో రేవంత్‌పై దుమ్మెత్తిపోశారు. పార్టీ కోసం 34 ఏండ్లు శక్తి వంచన లేకుండా పనిచేశానని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు వెంగళ్‌రావు, వైఎస్‌ఆర్, రోశయ్యతోపాటు కిరణ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేశానని గుర్తుచేశారు. పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పనిచేసినా ఎలాంటి ఇబ్బందులు కలుగలేదని చెప్పారు. బస్తీ కమిటీ అధ్యక్షుడి స్థాయి నుంచి నేటి మైనార్టీ విభాగం చైర్మన్ వరకు అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చానని వివరించారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ బాధ్యతలు తీసుకున్నాడో పార్టీ భ్రష్టు పట్టడం మొదలైందని ఆరోపించారు. రేవంత్ నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖతం కావడం ఖాయమని చెప్పారు. డబ్బులు ఇచ్చిన వారికే పదవులు, పార్టీ టికెట్లు కేటాయించే స్థాయికి దిగజారిపోయిందని, గాంధీ భవన్‌ను ఓ షాపింగ్ మాల్‌గా మార్చివేశారని విమర్శించారు. నాడు రూ.50 కోట్లు లంచం తీసుకొని అప్పటి ఏఐసీసీ ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ పీసీసీ అధ్యక్ష పదవిని అమ్ముకున్నాడని విమర్శించారు. రేవంత్ రూ.50 కోట్లు పెట్టుబడి పెట్టి అంతకు రెట్టింపు లాభాలకు అసెంబ్లీ టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. పార్టీ హైకమాండ్ సైతం ఓ సంఘ్ పరివార్ నేతకు పీసీసీ బాధ్యతను అప్పగించడం బాధకలిగించిందని వాపోయారు. తాను ఎన్నడూ టికెట్ ఆశించలేదని, కానీ నేడు జరుగుతున్న టికెట్ల పంపిణీయే తనను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా కష్టపడి పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి కోట్లు గుమ్మరించిన వారికే టికెట్లు కేటాయించాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు తన వద్ద ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని, ఓబీసీ విభాగం చైర్మన్‌గా పనిచేసిన నూతి శ్రీకాంత్‌గౌడ్ పార్టీకి అన్నీ తానై పనిచేశాడని, టికెట్లు కేటాయింపులో మాత్రం మొండి చేయి చూపారని చెప్పారు. మలక్‌పేట టికెట్‌ను ఓ రియల్టర్ అయిన షేక్ అక్బర్‌కు రూ.10 కోట్లకు రేవంత్ అమ్ముకున్నాడని ఆరోపించారు. పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సునీల్ కనుగోలు పేరుతో సర్వే స్కామ్‌కు తెరలేపారని, డబ్బులు చెల్లించిన వారికే ఎక్కువ మార్కులు వచ్చేలా సర్వేలను రూపొందించారని విమర్శించారు. ఈ కుంభకోణం మొత్తం ఏఐసీసీ హెడ్‌క్వార్టర్స్‌లోనే జరిగిందని ఆరోపించారు. ఉదయ్‌పూర్ డిక్లకేషర్‌కు తూట్లు పొడిచారని, ఖైరతాబాద్ టికెట్‌ను పీ విజయారెడ్డికి కేటాయిస్తున్నామనే సాకుతో ఆమె సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డిని పక్కన పెట్టారని తెలిపారు. అలాంటప్పుడు మైనంపల్లి హన్మంతరావు ఆయన కొడుకు రోహిత్‌రావుకు టికెట్లు ఎలా ఇచ్చారని, ఈ లాజిక్ వారి విషయంలో ఎందుకు వర్తించలేదని నిలదీశారు.

### సామాజిక న్యాయం అపహాస్యం

టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం అనేది అపహాస్యం పాలైందని, ఒకప్పుడు సెక్యులర్ పార్టీగా ఉండేదని, నేడు రేవంత్ వ్యవహారంతో అగ్రవర్ణ పార్టీగా మారిపోయిందని సోహైల్ ఆరోపించారు. రేవంత్ కొనుగోలు చేసిన, ఆయనకు మద్దతుగా నిలిచిన నేతలందరూ డిసెంబర్ 3 తర్వాత బీజేపీలో చేరనున్నారని జోస్యం చెప్పారు. మరో వైపు 70 శాతం ముస్లిం ఓటర్లు ఉన్న బహదూర్‌పుర, చాంద్రాయగుట్ట, యాకుత్‌పుర నుంచి కాంగ్రెస్ తరఫున ముస్లిమేతరులకు టికెట్లు కేటాయించడంలో ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హిందువులు కూడా ఆ స్థానాల్లో పోటీ చేయాలని వాదిస్తున్న రేవంత్.. జూబ్లీహిల్స్ టికెట్‌ను అజారుద్దీన్‌కు ఏ ప్రాతిపదికన కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆయనను కాదని, బీజేపీ నుంచి శ్రీనివాస్‌రెడ్డిని దిగుమతి చేసుకొని టికెట్ కేటాయించడంలో రేవంత్ సంఘ్ పరివార్ ఎజెండా అర్థం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి వారి వల్ల కాంగ్రెస్‌కు భవిష్యత్ ఉండదని, అందుకే తాను రాజీనామా చేస్తున్నానని స్పష్టం చేశారు.

## టికెట్లు అమ్ముకున్నారు

**ఆదిలాబాద్ హస్తం నేత సాజిద్‌ఖాన్**



ఆదిలాబాద్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను నాయకులు అమ్ముకున్నారని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆరోపించారు. గతంలో బీజేపీలో ఉండి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తనని చెప్పుకున్న కంది శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆయన కోసం పనిచేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సోమవారం కార్యకర్తల సమావేశంలో చర్చించి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

## రేవంత్.. దమ్ముంటే రా! చూసుకుందాం

**నలుగురిని కాపాడుకోలేని వాడు అధ్యక్షుడా?.. కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి**



ఎల్లారెడ్డి, అక్టోబర్ 28: కాంగ్రెస్ లాబీయింగ్ పార్టీగా మారిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి విమర్శించారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో జైలుకు పోయినా వెంట నడిచానని, కోర్టుల చుట్టూ తిరిగానని గుర్తు చేసుకున్నారు. నమ్ముకున్న నలుగురు అనుచరులను కాపాడుకోలేని వాడు పీసీసీ అధ్యక్షుడా ? అని ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని తన నివాసంలో శనివారం అనుచరులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సుభాష్‌రెడ్డి ఉద్విగ్నంగా మాట్లాడారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మదన్‌మోహన్‌ను గెలవనివ్వనని శపథం చేశారు. రెబల్‌గా నామినేషన్ వేసి ఓడిస్తానని తేల్చిచెప్పారు. ''రేవంత్‌రెడ్డీ.. నీవెంట తిరిగితే చేసింది గిదా? కార్యకర్తలు అభీష్టం మేరకు నేను బరిలో ఉంటాను. ఆరు గ్యారెంటీ పథకాలు అని చెబుతున్న రేవంత్‌రెడ్డీ.. నీవెంట ఉన్న నలుగురిని దక్కించుకోలేక పోతే నీవేమీ పీసీసీ అధ్యక్షుడివి'' అని సుభాష్‌రెడ్డి ప్రశ్నించారు.

## పార్టీ కోసం పనిచేసినా టికెట్ దక్కలేదు

**పీసీసీ నేత కాటిపల్లి నగేశ్‌రెడ్డి**



డిచ్‌పల్లి, అక్టోబర్ 28: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన పీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి శనివారం డిచ్‌పల్లి కేఎన్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ కా ర్యకర్తలతో సమావేశమై ఆవేదన వెళ్లగక్కా రు. కష్టపడి పనిచేసిన తనకు టికెట్ దక్కకపోవడం బాధగా ఉందన్నారు. 2009, 2014, 2018 టికెట్ ఇవ్వలేదని, ఈసారైనా వస్తుందని భావించానని పేర్కొన్నారు.



## కాంగ్రెస్ టికెట్‌లో మనీ ఫార్ములా!

- మూడుసార్లు ఓడిపోయినోనికి పార్టీ పెద్దలు టికెట్ ఇచ్చిండ్రు
- పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి ఆగ్రహం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 28: 'ఎం' (మనీ) ఫార్ములాతోనే కాంగ్రెస్ తనకు టికెట్ ఇవ్వలేదని పీసీసీ కార్యదర్శి, పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు దండెం రాంరెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి పేరును ప్రకటించడంతో ఆయన శనివారం తన అనుచరులు, మద్దతుదారులతో పెద్దఅంబర్‌పేటలోని నివాసంలో భేటీ అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు అభ్యర్థుల జాబితాలో తన పేరే ఉన్నదని, మధ్యాహ్నం తర్వాత 'ఎం' ఫార్ములాతో టికెట్‌ను మల్‌రెడ్డి రంగారెడ్డికి ఇచ్చిందని ఆరోపించారు.



## కుక్క నోట్లో రేవంత్ మూతి!

- టికెట్లు స్థానికులకు కాకుండా ప్యారాచూట్‌కు ఎట్లిస్తరు?
- అమ్ముడు పోవాల్సిన అవసరం మాకు లేదు
- పాల్వాయి స్రవంతి ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): స్థానికులైన తమను కాదని.. ఓ ప్యారాచూట్ నాయకుడికి టికెట్ ఇచ్చి.. కుక్కనోట్లో మూతిపెట్టినట్లు కాంగ్రెస్ పెద్దలు, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యవహరించారని మునుగోడు కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి కన్నీటి పర్యంతమయ్యారు. డబ్బులకు తాము అమ్ముడుపోయామని ఓ చిల్లర గ్యాంగ్ ప్రచారం చేస్తున్నదని.. చిల్లర మాటలు మాట్లాడితే చెప్పు తో కొట్టడం వచ్చు.. నాల్క చీరడమూ వచ్చని రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మునుగోడు టికెట్ దక్కకపోవడంపై అసంతృప్తితో ఉన్న స్రవంతి శనివారం తన మద్దతుదార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ.. 'మాపై తప్పుగా ఒర్లుతున్నరు.. తిప్పి నాలుగు సరుద్దామంటే పార్టీ గుర్తుకొస్తున్నది. పైసల మూటలు మోసుకొచ్చిండని, ఎదుటి వ్యక్తి ఎలాంటోడో తెలియకుండా కుక్క నోట్లో మూతి పెట్టినట్లే టికెటిచ్చిండ్రు. ఉల్టా మమ్మల్ని ఎంగిలి మెతుకులకు ఆశపడ్డరని అంటున్నరు. ఆ మాటలనే ముందు అందులో అర్థమేందో తెల్సుకోవాలె. రాజకీయాలకు కొత్తగొచ్చి పార్టీ టికెట్లు కొనుక్కునేటోళ్లు మాట్లాడే మాటలవి. మీరు ధనబలంతోనే రాజకీయం చేస్తమంటే మేము అంగీకరించే పరిస్థితుల్లో లేము' అంటూ తన బాధను వ్యక్తం చేశారు.




## రేవంత్ డౌన్ డౌన్

**జడ్చర్ల కాంగ్రెస్‌లో అసమ్మతి**

**రెబల్‌గా బరిలోకి : ఎర్రశేఖర్**

జడ్చర్ల, అక్టోబర్ 28: జడ్చర్ల కాంగ్రెస్‌లో ముసలం రాజుకుంది. నియోజకవర్గం నుంచి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, మరోనేత అనిరుధ్‌రెడ్డి పోటీపడ్డారు. చివరికి అనిరుధ్‌కే టికెట్ దక్కడంతో ఎర్రశేఖర్ వర్గం ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన ఎర్రశేఖర్ అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో తన నివాసంలో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు గెలిచే సీట్లు కాకుండా ఓడిపోయే సీట్లు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. కార్యకర్తల కోరిక మేరకు కాంగ్రెస్ రెబల్‌గా బరిలోకి దిగుతున్నట్టు చెప్పారు. సర్వేలకు వ్యతిరేకంగా టికెట్లు కేటాయించారని మండిపడ్డారు. మరోమారు సర్వే నిర్వహించి టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



## సర్వేల పేరుతో మోసం

**కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించారు**

**నన్ను నిండా ముంచారు: నాగం**

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): పార్టీ ఔన్నత్యాన్ని పెంచిన తనకు టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ ఇలా మోసం చేస్తుందనుకోలేదని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్న సమయంలో తాను ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పార్టీని బతికించానని తెలిపారు. ఇంతచేసినా తనకు ఎందుకు టికెట్ ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. సర్వేల పేరుతో మోసం చేశారని, ఇవాళ పార్టీని తెలంగాణలో నాశనం పట్టించారని ఆగ్రహించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు టికెట్లు ఇవ్వడం బాధగా ఉన్నదన్నారు. కార్యకర్తలతో సమావేశం భవిష్యత్తు నిర్ణయాన్ని ప్రకటిస్తానని నాగం తెలిపారు.

## రేవంత్.. నీ బాగోతం బయట పెడతా

- నీకు డబ్బు దాహం ఎక్కువ
- ఈడీ రేవంత్ ఇంట్లో సోదాలు చేయాలి
- ముథోల్‌లో విజయ్‌కుమార్‌రెడ్డి ఫైర్



భైంసా, అక్టోబర్, 28: రేవంత్ బాగోతం బయటపెడతానని కాంగ్రెస్ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ముథోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తే.. తనను కాదని నారాయణరావు పటేల్‌కు కేటాయించారని మండిపడ్డారు. శనివారం భైంసాలో ఆయన మాట్లాడారు. రేవంత్ టికెట్ ఇస్తానని అమెరికా నుంచి రప్పించి నా సమయమంతా వృథా చేశారని, అమెరికా వస్తే ఎన్నారైలంతా చెప్పుతో కొడతారని హెచ్చరించారు. 'నీకు డబ్బు దాహం ఎక్కువగా ఉన్నది. అతి త్వరలో నీ బాగోతం బయటపెడతా. డబ్బులకు టికెట్ అమ్ముకున్నావ్. ఎన్నారై అని అనుకుంటున్నావ్. నేను గ్రామస్థాయి నుంచి వచ్చిన వాడినే' అని ధ్వజమెత్తారు. రేవంత్ ఇంట్లో ఈడీ సోదాలు చేయాలని, టికెట్ కోసం నారాయణరావు పటేల్ ఎక్కడెక్కడ డబ్బులు ఇచ్చాడో బయటపెడతానని వెల్లడించారు. ముథోల్ నియోజకవర్గ ప్రజలంతా రేవంత్‌కు శాపనార్థాలు పెడుతున్నారని, అమెరికాలో సైతం ఆయన దందాలు బయటపెడతానని స్పష్టంచేశారు.

## రేవంత్ దగా చేశాడు

**హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మండిపాటు**



హుస్నాబాద్, అక్టోబర్ 28: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనను రెండుసార్లు నమ్మించి గొంతు కోసిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని తన నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక నాయకులు అసమర్థులుగా, స్థానికేతరులు సమర్థులుగా కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. రెండు రోజుల్లో కార్యచరణ ప్రకటిస్తామని చెప్పారు. పొన్నం ప్రభాకర్ శనివారం అల్గిరెడ్డి ఇంటికి వెళ్లి మద్దతు కోరగా, అందుకు ఆయన తిరస్కరించినట్టు తెలిసింది.

## లంబాడీల జాతిద్రోహి రేవంత్‌రెడ్డి

**అగ్రవర్ణ అహంకారంతో మాటలు.. ఎల్‌హెచ్‌పీఎస్ భేటీలో గిరిజన సంఘాల నేతలు**



ఖైరతాబాద్, అక్టోబర్ 28: 'వెయ్యి రూపాయలు ఇచ్చి, సారా పోస్తే లంబడోళ్లు ఓట్లు వేస్తారంటూ అగ్రవర్ణ దురహంకారంతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి! ఇక నీ ఓటమికి రోజులు లెక్కపెట్టుకో.. లంబాడీల జాతిద్రోహి ఖబడ్దార్' అంటూ గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు. లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ గిరిజన సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోట్యా నాయక్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, ఎల్ఎస్‌వో అధ్యక్షుడు అశోక్ నాయక్‌లు.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న గిరిజనులను విస్మరించిన వారిని బంగాళాఖాతంలో కలిపే సత్తా తమకు ఉన్నదని అన్నారు. రేవంత్‌రెడ్డికి లంబాడీల ఎదుగుదల ఇష్టం లేదని, తమ జాతి అణచివేతకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఖానాపూర్‌లో నలుగురు గిరిజనుల మృతికి కారకుడైన భోజుకు టికెట్ ఇచ్చాడని మండిపడ్డారు. ఆదివాసీలు ఎక్కువగా ఉన్న బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో లంబాడీలకు సీట్లు కేటాయించడంలోనే రేవంత్ కుట్ర వెల్లడవుతున్నదని చెప్పారు. బోథ్‌లో సోయం బాపురావును గెలిపించేందుకు రెండువేల ఓట్లు ఉన్న నాయక్‌పోడ్ వర్గానికి సీటు కేటాయించాడని అన్నారు. మానుకోట టికెట్‌ను గిరిజన మేధావి బెల్లయ్యానాయక్‌కు కాదని, డబ్బులిచ్చిన వారికి అమ్ముకున్నాడని ఆరోపించారు. గిరిజనులపై నిత్యం విషం కక్కే రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కను ఓడగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను మొత్తం 119 నియోజకవర్గాల్లో భూస్థాపితం చేస్తామని తేల్చి చెప్పారు.




## టికెట్ల పంపిణీలో అన్యాయం

**పాలేరులో మాధవీరెడ్డి ఆవేదన**

కూసుమంచి, అక్టోబర్ 28: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ టికెట్ తనకు ఇవ్వకపోడానికి కారణాలు చెప్పాలని పీసీసీని పాలేరు మాజీ సర్పంచ్ రామసహాయం మాధవీరెడ్డి ప్రశ్నించారు. ఐదేండ్లుగా పార్టీ కోసం పనిచేస్తూ టికెట్ ఇస్తారని కష్టపడితే అన్యాయం చేశారని, అనుచరులతో చర్చించి నాలుగు, ఐదు రోజుల్లో భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తానని చెప్పారు.

## రేవంత్ స్వలాభానికి కాంగ్రెస్ నాశనం

- టికెట్ ఇవ్వకుంటే పార్టీకి దెబ్బ
- కొత్తోళ్లకు ఇచ్చి, నాకు అన్యాయం
- రెండురోజుల్లో కార్యాచరణ: జంగా



కాజీపేట, అక్టోబర్ 28: స్వలాభం కోసం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని నాశనం చేస్తున్నారని వరంగల్ డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత జంగా రాఘవరెడ్డి ఆరోపించారు. అధిష్ఠానం తనకు వరంగల్ పశ్చిమ టికెట్ కేటాయించని పక్షంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పార్టీ దెబ్బతింటుందని హెచ్చరించారు. వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ టికెట్ ఆశించి, బంగపడిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండటానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్‌లోకి కొత్తగా వచ్చిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డికి టికెట్లు ఇచ్చి, పార్టీకి అన్ని విధాలా అండగా ఉన్న తనను విస్మరించడం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్‌లో పార్టీ బలోపేతానికి, పార్టీ సమావేశాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో కొంతమంది పెద్దలు కావాలనే కుట్రలు చేసి అన్ని అర్హతలున్న తనకు వరంగల్ పశ్చిమ టికెట్ ఇవ్వకుండా చేశారని మండిపడ్డారు. రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టంచేశారు.

# కోమటిరెడ్డి, ఉత్తమ్ కాంగ్రెస్ వైరస్‌లు

- మునుగోడు బరిలో ఉంటా: కాంగ్రెస్ నేత చలమల్ల కృష్ణారెడ్డి



నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్28(నమస్తే తెలంగాణ)/చౌటుప్పల్: బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఒక్క రోజులోనే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి టికెట్ ఎలా ఇస్తారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించింది నిజం కాదా అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ కాంగ్రెస్‌కు వైరస్‌లా తయారయ్యారని, వారి కుటుంబాల్లో ఇద్దరిద్దరు టికెట్లు ఎలా తీసుకుంటారని నిలదీశారు. మునుగోడులో స్థానికుడినైన తాను బరిలో ఉండడం ఖాయమని తేల్చిచెప్పారు. పరాయిగడ్డ నుంచి వచ్చిన రాజగోపాల్‌రెడ్డి ఇక్కడ రాజ్యమేలుతానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు చలమల శనివారం ఓ సెల్ఫీ వీడియో విడుదల చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అనుచరులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తానని తెలిపారు. మొదటి లిస్టులో తనకు టికెట్ వచ్చినా తమ్ముడి కోసం వెంకట్‌రెడ్డి ఆలోచించారని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో తమ్ముడి ప్రయోజనాల కోసం వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలను బొంద పెటారని ధ్వజమెత్తారు. స్రవంతిని ఓడిచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

## కాంగ్రెస్‌లో మాకు గుర్తింపు లేదు

**నిన్న కాక మొన్న వచ్చిన రేవూరికి టికెట్టా?: పరకాల నేత ఇనగాల వెంకట్రాంరెడ్డి**

పరకాల, అక్టోబర్ 28: పార్టీ కోసం పనిచేసే వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు లేదని సీనియర్ నేత, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 12 ఏండ్లుగా పార్టీ బలోపేతానికి కష్టపడుతున్న తనకు కాకుండా వారం క్రితం పార్టీలో చేరిన రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. శనివారం హనుమకొండలోని తన నివాసంలో అనుచరులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కొంతమంది అధిష్ఠానం పెద్దల సూచనతో పరకాల టికెట్ తనకే వస్తుందని శుక్రవారం వరకు ఆశపడ్డానని, కానీ తనకు మొండి చేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టంచేశారు. 24 గంటల్లో తనకు టికెట్ కేటాయించాలని, లేని పక్షంలో తనదారి తాను చూసుకుంటానని హెచ్చరించారు.



మద్దతుదారులతో సమావేశమైన కాంగ్రెస్ నేత ఇనగాల వెంకట్రాంరెడ్డి



## నమ్మకద్రోహం చేశారు

**చొప్పదండి నేత నాగి శేఖర్ ఆవేదన**

రామడుగు, అక్టోబర్ 28: కాంగ్రెస్‌లో 22 ఏండ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్నానని, తన సేవలను గుర్తిస్తుందని.. చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ తనకే ఇస్తుందన్న నమ్మకంతో ఉన్న తనకు పార్టీ ద్రోహం చేసిందని కాంగ్రెస్ యువజన విభాగం పార్లమెంటరీ అధ్యక్షుడు నాగి శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థిగా మేడిపల్లి సత్యంను ఖరారు చేయడంపై నిరాశ చెందారు. చొప్పదండిలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈరోజు తనను గుర్తించకపోవడం బాధగా ఉన్నదని కన్నీటి పర్యంతమయ్యారు.



## రేవంత్ మోసం చేసిండు

**డబ్బులకు అమ్ముడు పోయిండు**

**ఆసిఫాబాద్‌లో సరస్వతి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 28: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ తనకు టికెట్ కేటాయిస్తానని చెప్పి మోసం చేశారని ఆసిఫాబాద్ టికెట్ ఆశించిన మర్సుకోల సరస్వతి మండిపడ్డారు. కాంగ్రెస్ ఓ దొంగ, బ్లాక్ మెయిలర్, అవినీతి పరుడైన శ్యాంనాయక్‌ను ఆసిఫాబాద్ అభ్యర్థిగా ప్రకటించిందని ఆగ్రహించారు. శనివారం ఆమె ఆసిఫాబాద్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ డబ్బులకు అమ్మడుపోయి శ్యాంనాయక్‌కు టికెట్ ఇచ్చిందని ఆరోపించారు. ఎక్కడి నుంచో వచ్చిన శ్యాంనాయక్‌కు టికెట్ కేటాయించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. 2002 నుంచి కాంగ్రెస్‌లో ఉన్నానని తెలిపారు. నియోజవర్గంలో తమ వర్గానికి 15 వేల ఓట్లు ఉన్నాయని, తమ తొమ్మిది తెగలకు చెందినవి 90 వేల ఓట్లు ఉన్నాయని వివరించారు. తన తండ్రి కొట్నాక భీంరావు ఉన్నప్పటి నుంచే ప్రజలతో సంబంధాలున్నాయని చెప్పారు. నమ్ముకున్న కార్యకర్తలు, అభిమానులతో చర్చించి కార్యచరణ ప్రకటిస్తానని తెలిపారు.